సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 3 । మార్చి । 2024



మోడల్ స్కూల్..డిమాండ్ ఫుల్

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు డిమాండ్ పెరుగుతోంది. 1300 సీట్లను భర్తీ చేయనున్నారు.

- IIలో



వ్యాన్‌ను ఢీకొన్న బైక్

వ్యాన్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పైడిభీమవరం వద్ద ప్రమాదం జరిగింది.

- IIలో

ఓటర్లకు అవగాహన అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటుహక్కును అంతా వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా న్యాయసదన్‌లో విభిన్న ప్రతిభావంతుల ఓటర్లు అవగాహన సదస్సులు, వాటిపై చేసిన కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. స్వీప్ నోడల్ అధికారి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ స్వీప్ కార్యక్రమాలపై వివరించారు.

న్యూస్‌రీల్

నేడే పల్స్‌పోలియో



కవిటి: పెద్ద ఎర్రగోవిందపుట్టుగలో చిన్నారుల ప్రదర్శన

అరసవల్లి: ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందు కోసం జిల్లాలో 1232 పోలియో బూత్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో 30 మండలాల పరిధిలో ఐదేళ్ల లోపు చిన్నారులు 1,79,984 మంది ఉన్నట్లు సమాచారం. అలాగే అదనపు అవసరాల కోసం 3.12లక్షల డోసులను సిద్ధం చేశారు. ఇప్పటికే అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, దేవాలయాలు, ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనం రద్దీగా ఇతర ఉన్న ప్రాంతాల్లో పోలియో చుక్కలను వేసేందుకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం కోసం 78 మొబైల్ బృందాలు, 121 సూపర్‌వైజర్ బృందాలు పనిచేయనున్నాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి కోరారు.

కొన్ని రోజులపాటు గుణుపూర్ పాసింజరు రైలు రద్దు

ఆమదాలవలస: విశాఖ నుంచి గుణుపూర్ వెళ్లే పాసింజర్ స్పెషల్ రైలును కొన్ని రోజుల పాటు రద్దు చేసినట్లు శ్రీకాకుళం రోడ్ (ఆమదావలస) రైల్వే స్టేషన్ అధికారులు శనివారం తెలిపారు. నౌపడ-పర్లాకిమిడి సెక్షన్ మధ్యలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే ఈ రైలును ప్రతి బుధవారం, ఆదివారం రద్దు చేసినట్లు తెలిపారు. ఈ నెల 3, 6, 10, 13, 17, 20, 24, 27, 31 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేరు డివిజన్ నుంచి సమాచారం అందినట్లు పేర్కొన్నారు.

సమీకృత కలెక్టరేట్ పనుల పరిశీలన



సమీకృత కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమీకృత కలెక్టర్ కార్యాలయ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన సముదాయాన్ని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, రహదారులు, భవనాలశాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఫిబ్రవరి 17వ తేదీ పర్యటనలో నాటి పనుల్లో పురోగతి, నిర్దేశించిన పనులపై ఆరా తీశారు. నాణ్యతలో రాజీ లేకుండా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్, ఈఈ రవి నాయక్, డిఈఈ ఎంఎల్‌వీ సాగర్ తదితరులు ఉన్నారు.

వ్యర్థానికి సరికొత్త అర్థం

అనగనగా ఒక ఊరు. పేరు నారువ. ఆ ఊరి నిండా కొబ్బరి తోటలే. చూసేందుకు పచ్చగానే ఉంటుంది గానీ ఎక్కడ చూసినా కొబ్బరి వ్యర్థాలు ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తూ ఇబ్బంది పెడుతుంటాయి. సాధారణంగా అయితే వ్యర్థాలను నిర్వీర్యం చేసేస్తారు. కానీ ఓ ముగ్గురు విద్యార్థులు తమ గురువు సాయంతో ఈ వ్యర్థాల నుంచి సంపద తయారు చేయడంపై దృష్టి పెట్టారు. విధానం పాతదే అయినా ఆలోచన కొత్తగా చేసి వ్యర్థాలకు సరికొత్త అర్థాన్నిచ్చారు. నారువ విద్యార్థుల ఈ ప్రతిపాదన రాష్ట్రస్థాయికి సైతం ఎంపికైంది.



- రాష్ట్రస్థాయికి ఎంపికైన నారువ విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టు
- వేస్ట్ టు వెల్త్ పేరిట కొబ్బరి వ్యర్థాల వినియోగం
- వ్యర్థాల నుంచి సంపద సృష్టే ప్రధాన అంశం

రణస్థలం:

కొబ్బరి అంటే కాయ మాత్రమే కాదు కదా.. వ్యర్థాలు కూడా. కానీ కాయలు ఎగుమతి చేసి వ్యర్థాలను తోటలోనే పడేస్తారు. ఆ పడేసిన వ్యర్థాల నుంచి సరికొత్త పదార్థాలు తయారు చేసి విక్రయించవచ్చని, ఖరీదైన పద్ధతుల్లోనే కాకుండా పెద్దగా ఖర్చు కా ని విధానాల్లో కూడా చిన్న చిన్న వస్తువులు తయారు చేసుకోవచ్చని నారువ జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో క్లాసు విద్యార్థులు గుర్తు చేస్తున్నారు. నోకాస్ట్.. లోకాస్ట్ దిశగా ఆ వస్తువుల తయారీపై ప్రత్యేక దృష్టి సారించారు. నిద్రబంగి హిమబిందు, చిల్లా స్వాతి, గిన్ని గోవిందమ్మ అనే ముగ్గురు విద్యార్థినుల ఆలోచనకు సైన్స్ టీచర్ కృష్ణమూర్తి సహకారం తోడైంది. ఈ ప్రాజెక్టును సంపూర్ణంగా తయారు చేసి ఇటీవల జరిగిన సైన్స్ ప్రదర్శనలో పెట్టారు. అందరి దృష్టిని ఆకర్షించిన ఈ ప్రాజెక్టు ఇప్పుడు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.



వ్యర్థాలు వినియోగిస్తే..

నారువ గ్రామంలో కొబ్బరి తోటలు ఎక్కువగా ఉంటాయి. ఈ కొబ్బరిని ఇతర రాష్ట్రాలకు బొండాలు, కాయల రూపంలో ఎగుమతి చేస్తుంటారు. కొబ్బరి కాయలు ఎగుమతి చేస్తున్నప్పుడు కొబ్బరి పీచు(క్వాయిర్) వలిచి కాయలు మాత్రమే ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. అయితే మిగిలిన పీచును వ్యర్థాల రూపంలో అక్కడే పడేస్తారు. అలాగే కొబ్బరి బొండాలు కూడా రోడ్డు పక్కల తాగేసి పడేస్తారు. వీటిల్లో నీరు చేరడం వల్ల దోమలు వ్యాపించి రోగాలు ప్రబలుతాయి. ఈ వ్యర్థాలు అలా వృథాగా వదిలేయకుండా ప్రత్యేకంగా గృహోపకరణాలుగా పనికి వచ్చేలా ఆలోచన చేశారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టించే విధంగా, ఎకో ఫ్రెండ్లీ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు

తక్కువ ఖర్చుతో..

కొబ్బరి పీచును సేకరించి ఇంటికి పనికి వచ్చేలా పరుపులు, తలగడలు, గిన్నెలు తోముకునే, ఒళ్లు రుద్దుకునే పీచులు, కొబ్బరి తాళ్లు తయారు చేస్తారు. ఒక మిషనరీని ఉపయోగించి చాలా వరకు కొబ్బరి ఫైబర్(పీచు)ను తీసి ఎగుమతి కూడా చేస్తారు. ఇప్పటికే బస్సు, కారు, ట్రైను సీట్లలోను, సోఫాసెట్లలోనూ పీచు విరివిగా వినియోగిస్తున్నారు. భవిష్యత్‌లో తక్కువ ఖర్చుతో ఉపయోగపడే చిన్న పరిశ్రమలు పెట్టవచ్చుననే ఆలోచనతో విద్యార్థులు ఈ ప్రాజెక్టు తయారు చేశారు.

దీని వల్ల గ్రామంలో వ్యర్థాలు తగ్గుతాయి. అలాగే కొబ్బరి పీచు వేరు చేసినప్పుడు మొత్తటి పొడి వస్తుంది. ఈ పొడి ఇటుకల తయారీలో ఉపయోగిస్తే తక్కువ బరువు, అధిక సాంద్రత కలిగిన ఇటుకలు తయారవుతాయని ప్రాజెక్టులో వివరించారు. పర్యావరణానికి మేలు చేసే ఈ ప్రాజెక్టు ఉపయోగాలు స్పష్టంగా వివరించడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు.



ఇంట్లో ఉపయోగపడే గృహోపకరణాలు

సంపద సృష్టే ఉద్దేశం



గ్రామీణ ప్రాంతాల్లోని కొబ్బరి వ్యర్థాలు అలా వదిలేయడం వల్ల నీరు చేరి దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఈ కొబ్బరి పీచు, పడేసిన బొండాలతో ఇంటికి ఉపయోగపడే గృహోపకరణాలను తక్కువ ఖర్చుతో తయారు చేయవచ్చు. దీనివల్ల మన చుట్టుపక్కల పర్యావరణం కూడా బాగుంటుంది. ఈ అంశాలను వివరించడం వల్ల రాష్ట్ర స్థాయికి ఈ సైన్సు ప్రాజెక్టు ఎంపికైంది.

– ఎం.కృష్ణమూర్తి, సైన్స్ గైడ్ టీచర్

మంచానికి కట్టేసి..



కత్తితో బెదిరించి



వృద్ధురాలి వద్ద వివరాలు సేకరిస్తున్న అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్

- వృద్ధురాలి నుంచి 30 తులాల బంగారం కొట్టేసిన అగంతకులు
- నెల రోజులుగా రెక్కీ వేసి మరీ చోరీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని బొంతావారి వీధిలో శనివారం పట్ట పగలే ఓ వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారు నగలను దొంగలు దోచుకెళ్లారు. ఆమెను మంచానికి కట్టేసి, కత్తితో బెదిరించి 30 తులాల బంగారం చోరీ చేశారు. బాధితురాలు, పోలీసులు చెప్పిన వివరాల్లోకి వెళ్తే.. బొంతావారి వీధిలో నివాసముంటున్న బమ్మిడిపాటి జగదాంబ భర్త చనిపోవడం, కుమార్తెలిద్దరికీ వివాహం కావడంతో ఒక్కగానొక్క కుమారుడు శ్రీనివాసరావుతో కలిసి ఉంటున్నారు. శ్రీనివాసరావు నగరంలోని సాయి మెడికేర్‌లో పనిచేస్తున్నాడు. ఉదయమంతా వృద్ధురాలు ఇంటిలో ఒంటరిగానే ఉంటారు.

పెళ్లి శుభలేఖ ఇస్తామంటూ..

ఎప్పటిలాగే శనివారం ఉదయం శ్రీనివాసరావు విధులకు వెళ్లిపోయాడు. జగదాంబ ఇంటిలో వంట చేస్తుండగా.. ఇద్దరు అగంతకులు ఇంటి ముందున్న గేట్లు తీసుకుని నకిలీ పెళ్లి కార్డుతో లోపలకు వచ్చారు. జగదాంబ ఎవరని ప్రశ్నించగా పెళ్లికి పిలవడానికి వచ్చామని చెప్పారు. కార్డు బయట పెట్టి వెళ్లిపొండని చెబితే.. వారు వినకుండా అమాంతం లోపలకు దూసుకువచ్చేశారు. వృద్ధురాలు ప్రశ్నించే లోగానే ఆమె నోరు నొక్కేసి మంచానికి కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కేశారు. ఆమె మెడలో ఉన్న ఐదు తులాల నాలుగు పేకల గొలుసు, మూడు తులాల రెండు పేకల గొలుసు, చేతులకు ఉన్న సుమారు 20 తులాలుండే 16 గాజులు, తులంన్నర పగడం గుండుతో కలిపి మొత్తంగా 30 తులాల బంగారు ఆభరణాలు దోచుకున్నారు. కేకలు వేయడానికి ప్రయత్నించగా కత్తితో బెదిరించారు. బంగారం తీసుకుని వారు రెప్పపాటులో పరారైపోయారు. ఈ హఠాత్పరిణామం నుంచి తేరుకున్న వృద్ధురాలు కేకలు వేయగా.. పక్కింటిలో ఉన్న సుధీర్ వచ్చి చూసేసరికి మంచానికి కట్టేసి ఉన్న వృద్ధురాలు కనిపించింది. దీంతో బయట ఉన్న సరిత అనే మహిళను పిలిచి ఆమె సాయంతో కట్లు విప్పి విషయం తెలుసుకుని కుమారుడికి సమాచారం అందజేశారు. పోలీసులకు కూడా చెప్పడంతో ఒకటో పట్టణ సీఐ లెంక సన్యాసినాయుడు, ఎస్ఐ బలివాడ గణేష్ ఘటనా స్థలికి వెళ్లి వేలిముద్రలు సేకరించారు. అదనపు ఎస్పీ జి.ప్రేమ్ కాజల్, డీఎస్పీ యర్రగుంట శృతి హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిశీలించారు.

రెక్కీ చేసి మరీ..?

దొంగతనానికి నెల రోజుల ముందుగా దొంగలు రెక్కీ వేసినట్లు తెలుస్తోంది. నెల రోజుల కిందట ఇలా ఇద్దరు వచ్చి మందులు తెచ్చామని చెబితే తలుపులు తీయలేదని, ఇలా మూడు సార్లు జరిగిందని బాధితురాలు పోలీసులకు తెలిపారు. జగదాంబ నివసిస్తున్న పక్క ఇంటికి సీసీ కెమెరాలున్న విషయం తెలుసుకున్న అగంతకులు గత నెల 13న వేకువజాము 3:51 గంటలకు కర్రకు నల్లరంగు పెయింట్‌తో కూడిన బ్రష్‌కట్టి సీసీ కెమెరాలకు రంగు వేసినట్లు పుటేజీలో నిక్షిప్తమైవుంది. శనివారం దొంగతనం జరిగే సమయంలో కూడా పక్కింటి వారు బయట కూర్చుంటుండగానే లోపలికి దొంగలు జొరబడటం విశేషం.

సీనియర్ ఇంటర్ పరీక్షలకు 622 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో సీనియర్ ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. శుక్రవారం ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభంకాగా.. శనివారం నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థుల పరీక్షలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 83 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 19,417 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 18,795 మంది పరీక్ష రాశారు. 622 మంది గైర్హాజరయ్యారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్, డీవీఈఓ కోట ప్రకాశరావు జిల్లాలోని పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండోరోజు పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదు.

ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సుల నమోదు తప్పనిసరి

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల డిగ్రీ, పీజీ విద్యార్థులు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిర్వహించే ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. వర్సిటీ పరిపాలన భవనంలో శనివారం వివరాలు వెల్లడించారు. ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కాగా ఎడెక్స్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆన్‌లైన్ కోర్సులు పూర్తిచేయటం వల్ల విషయ పరిజ్ఞానం, విజ్ఞానం, నైపుణ్యాలు మెరుగుపడి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

తీగ లాగారు.. డొంక కదిలింది



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక, రికవరీ చేసిన సామగ్రి

- 7 కేసుల్లో 21 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- ఒడిశాకు చెందిన ఇద్దరు అరెస్టు
- ఎస్పీ జీఆర్ రాధిక ప్రకటన

నరసన్నపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు దొంగతనాలకు పాల్పడిన కేసులను నరసన్నపేట పోలీసులు ఛేదించారు. నరసన్నపేట శ్రీరామ నగర్-3లో జామి వరలక్ష్మి అనే మహిళ మెడలో నుంచి గత నెల లో బంగారు ఆభరణం ఎత్తుకెళ్లారు. దీనిపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు నిర్వహించిన పోలీసులు మరో ఆరు కేసుల్లో నిందితులుగా ఉన్న ఒడిశాకు చెందిన వ్యక్తులు శిబ శంకర్ మహంతి, సురేష్ పాడిలను అరెస్టు చేశారు. వీరి వద్ద 7 కేసులకు సంబంధించి 21 తులాల ముప్పావు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ జీఆర్ రాధిక నరసన్నపేట సీఐ కార్యాలయంలో శనివారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. పార్వతీపురం పీఎస్‌లో రెండు, విజయనగరం టూ టౌన్‌లో రెండు, విశాఖ సిటీ పీఎం పాలెం, విశాఖ త్రీ టౌన్, నరసన్నపేట పోలీసు స్టేషన్లలో నమోదైన చోరీ, చైన్ స్నాచింగ్ కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారని పేర్కొన్నారు. నరసన్నపేటలో లభించిన ఆధారాలతో దర్యాప్తు చేయగా పాత కేసుల విషయాలు తెలిశాయని, ఆ సొత్తును కూడా రిక వరీ చేశామని ఆమె వెల్లడించారు. వీరు చైన్ స్నాచింగ్ చేస్తూ పోలీసుల నుంచి తప్పించుకునేందుకు బైక్ నంబర్ ప్లేట్లు మారుస్తూ వచ్చారని వివరించారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలు విక్రయించకుండా కరిగిస్తున్నారని, దీనికి సంబంధించిన సామగ్రి కూడా రికవరీ చేశామని చెప్పారు. వీరి వద్ద నుంచి రెండు చాకులు, ఒక నాటు తుపాకీతో పాటు వారు వాడిన నంబరు ప్లేట్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నరసన్నపేట జమ్ము కూడలి వద్ద వీరిని అరెస్టు చేశామన్నారు. శిబ శంకర్‌ది బరంపురంలో కృష్ణంపేట వీధి అని, సురేష్ పాడిది అదే పట్టణంలోని లక్ష్మీనరసింగవీధిగా గుర్తించామని పోలీసులు తెలిపారు ప్రెస్ మీట్‌లో అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, టెక్కలి డీఎస్పీ బాల చంద్రారెడ్డి, నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు, ఎస్ఐ అశోక్‌బాబులు ఉన్నారు.

క్లుప్తంగా

కిడ్నీ వ్యాధిపై అప్రమత్తం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: కిడ్నీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శనివారం కోర్టులోని న్యాయసదన్‌లో ప్రాథమిక దశలోనే కిడ్నీ వ్యాధిని గుర్తించడం ఎలా అనే అంశంపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, ఆర్టీసీ పీఆర్‌ఓ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు లక్ష్యాలను చేరుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద కేటాయించిన లక్ష్యాలను బ్యాంకర్లు కచ్చితంగా చేరుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్‌ఆర్‌సీ) సమావేశంలో బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ సంబంధిత, ప్రాధాన్యత, అప్రాధాన్యత రంగాలు, ఎంసీఎంఈ కలుపుకుని 5,20773 మందికి రూ.10577 కోట్ల రుణాలు అందజేశామని, 102 శాతం ప్రగతి సాధించామని వివరించారు. 749 మంది స్వయం ఉపాధి శిక్షణలు తీసుకున్నారని తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం కింద జిల్లాకు 771 యూనిట్లు మంజూరు చేయాలని లక్ష్యం కేటాయించగా 273 యూనిట్లు మంజూరు చేశామన్నారు. ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద 951 దరఖాస్తులు రాగా అర్హత లేని 289 తిరస్కరించి మిగిలిన 63 శాతం లక్ష్యాలను సాధించగలిగామన్నారు.

లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్య కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎం.వి.తిలక్, నాబార్డు ఏజీఎం వరప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ విద్యా సాగర్, జిల్లా వ్యవసాయాధికారి కే.శ్రీధర్, పశు పశు సంవర్ధక శాఖ జేడీ కిషోర్, ఫిషరీస్, ఇండస్ట్రీస్ డీడీలు శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, డ్వామా పీడీ చిట్టి రాజు, డీసీసీబీ సీఈవో వరప్రసాద్, ఏపీజీవీబీ ఆర్‌ఎం రాఘవేంద్ర, జిల్లాలో 26 బ్యాంకులకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

మోడల్ స్కూల్.. డిమాండ్ ఫుల్

- కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన
- ఇంగ్లిష్ మీడియంతో అద్భుత ఫలితాలు
- జిల్లాలో 13 మోడల్ స్కూళ్లలో 1300 సీట్ల భర్తీ
- ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- మార్చి 3 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- లాటరీ విధానానికి స్వస్తి.. 21న ప్రవేశ పరీక్ష



మోడల్‌స్కూల్‌లో నీట్ తరగతుల నిర్వహణలో సమగ్రశిక్ష ఏఎంవో జి.లక్ష్మీనారాయణ



ఏపీ మోడల్ స్కూల్, కుప్పిలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లిషు భాషతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతర సబ్జెక్టుల్లో పట్టు తప్పనిసరి. ఇవన్నీ గతంలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమయ్యేవి. ఈ నేపథ్యంలో ప్రతి నిరుపేద విద్యార్థికి ఉత్తమ విద్యను అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలు (ఏపీ మోడల్ స్కూళ్లు/జూనియర్ కళాశాలలు) నేడు రాష్ట్ర ప్రభుత్వ ఆదరణతో సత్ఫలితాలు సాధిస్తున్నాయి. పరీక్ష ఏదైనా ఫలితాల్లో దూసుకెళ్తున్నాయి. ఇందులో చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు.

3 నుంచి దరఖాస్తుల స్వీకరణ..

2024–25 విద్యా సంవత్సరానికిగాను మోడల్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ నెల 2వ తేదీ నుంచి నెట్‌బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్‌కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో ఎగ్జామినేషన్ ఫీజుకు చెల్లుబాటు కానుండగా, దరఖాస్తులు చేసుకునే ప్రక్రియ ఈ నెల 3 నుంచి మొదలుకానుంది. ఆన్‌లైన్ పేమెంట్‌కు ఈ నెల 31వ తేదీతో గడువు ముగియనుంది.

జిల్లాలో 13 మోడల్ స్కూళ్లు

జిల్లాలో ఇచ్ఛాపురం(పురుషోత్తపురం), కంచిలి(ఎం.ఎస్.పల్లి), కవిటి(రాజపురం), సోంపేట(సోంపేట), పోలాకి(ఈదులవలస), పాతపట్నం(ప్రహరాజపురం), జలుమూరు(కరవంజ), జి.సిగడాం, లావేరు(తామాడ), రణస్థలం(కొండములగాం), పొందూరు(వావిలపల్లిపేట), ఎచ్చెర్ల(కుప్పిలి), బూర్జ(ఓవీపేట) పాఠశాలల్లో ఒక్కోచోట 100 సీట్లను భర్తీ చేస్తారు. ఈ లెక్కన మొత్తం 1300 మందిని ఎంపికచేస్తారు.

పాత పద్ధతిలో పరీక్ష..

లాటరీ విధానికి పూర్తిగా స్వస్తిపలికి దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూలులోనే ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. మెరిట్‌లిస్టు ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లు కేటాయించనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్‌లిస్టు, 29న ఎంపికైన వారి జాబితా వెల్లడిస్తారు. 30న సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జూన్ 12 నుంచి తరగతులు

మోడల్ స్కూళ్లలో లభిస్తున్న సౌకర్యాలివే..

- నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన
- ఐదు ఎకరాల సువిశాల ప్రాంగణాలతో రెండంతస్తుల భవనాలు
- 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఇంగ్లిషు మీడియంలోనే విద్యా బోధన
- నీట్, జేఈఈ, ఎంసెట్, ఎన్‌ఎంఎంఎస్, ఐఎంవో, ఐఎస్వో లాంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- అన్ని సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్‌లు
- ఎల్సీడీ ప్రొజెక్టర్ విద్యా బోధన, డిజిటల్ విద్యా బోధన
- ఇంటర్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు
- 9వ తరగతి నుంచి అకడమిక్ విద్యకు సమాంతరంగా కనీసం రెండు ఒకేషనల్ కోర్సులు
- మోడల్ స్కూళ్లకు సమీప గ్రామాల అనుసంధానంతో కూడిన ఆర్టీసీ బస్సులు ప్రత్యేకగా నడిపిస్తున్నారు.

ఎంపిక ఇలా..

- 6వ తరగతిలో ప్రవేశం పొందే ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. వీరు కనీసం 35 మార్కులు పొంది ఉండాలి. పరీక్ష ఫీజు రూ.150. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 30 మార్కులు పొంది ఉండాలి. పరీక్ష ఫీజు రూ.75 మాత్రమే.
- ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022–23, 2023–24 విద్యాసంవత్సరాల్లో 4, 5 తరగతుల్లో చదివి ప్రమోషన్‌కు అర్హత పొంది ఉండాలి.
- పరీక్షలో వచ్చే మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రతిపాదికన సీట్లు కేటాయిస్తారు.
- సీఎస్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్ లేదా ఏపీఎంఎస్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి..



గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించాలనే ధ్యేయంతో ఏపీ మోడల్ స్కూళ్లను తీసుకొచ్చారు. ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులకు సైతం విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. సద్వినియోగం చేసుకోవాలి.

– కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి

● పేదల సంక్షేమమే ధ్యేయం



పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగిస్తోందని శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ మండలం అన్నంపేట పంచాయతీ జంగాలవలస గ్రామ పరిధిలో అసైన్డ్ భూములకు సంబంధించి 19 మంది గిరిజన లబ్ధిదారులకు 18 ఎకరాలు భూమి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని అందజేసి వారికి ఆర్థికంగా చేయూత నందించే లక్ష్యంతో భూసంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు.

- బూర్జ

● మమేకమవుతూ.. ముందుకు సాగుతూ..



జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మండు టెండను కూడా లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నారు. పేదలతో మమేకమవుతూ వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటున్నారు. శనివారం కవిటి మండలం మాణిక్యపురం, కుసుంపురం, కవిటి, ఇద్దివానిపాలెం పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి వేతనదారులతో ముచ్చటించారు. ఓ ప్రజాప్రతినిధి తమ వద్దకు ఇలా రావడం పట్ల వారు ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమాల్లో నాయకులు పూడి లక్ష్మణరావు, దేవరాజ్‌సాహూ, ఊర్మిళ బిసాయి, కర్రి పద్మ తదితరులు పాల్గొన్నారు.

- కవిటి

కొండలు దాటి.. రైతుల కష్టాలు చూసి..

- అన్నదాతలను ఆదుకుంటానని మంత్రి సీదిరి హామీ



వాగు దాటుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: మండలంలోని కళింగదళ్ రిజర్వాయర్‌కు సంబంధించి బెల్లుపటియా సమీపంలో రాజుల కాలంలో నిర్మించిన బ్రిడ్జి కుప్పకూలిపోయింది. దీనిని స్థానికులు డియా అని పిలుస్తారు. సుమారు 1500 ఎకరాలకు సాగునీరు అందించే ఈ బ్రిడ్జి కూలిపోగా గత పాలకులు పట్టించుకోలేదు. సమస్యను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దృష్టికి రైతులు తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి, పొలాలు, డొంకలు, ముళ్లపొదలు, మెట్టలు దాటుకుని, సాగునీరు పారే బ్రిడ్జి వద్దకు శనివారం వెళ్లారు. అన్నదాతకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. హొన్నాళి, బెల్లుపటియా, సిద్ధిగాం, పింపిడియా, శ్రీరాంపురం, ఉప్పరిపేట తదితర గ్రామాలకు సంబంధించి సాగునీరు అందిస్తామని చెప్పారు. రైతుల నిర్ణయం మేరకే బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని మంత్రి హామీఇచ్చారు.

కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, బెల్లుపటియా సర్పంచ్ అగ్గున్న రమణమ్మ, వైస్ ఎంపీపీ కొర్నాని ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, జిల్లా కార్యదర్శి దల్లి జానకిరావురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతాడ గణపతి, వీరగున్నమ్మపురం, కుంటికోట సర్పంచ్‌లు కర్రి గణపతి, దుంపల వైకుంఠరావు, దువ్వు నారాయణరావు, పైల నారాయణరావు, మామిడి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 50 కుటుంబాల చేరిక



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: మండలంలోని యెన్నిరామన్నపేట(వైఅరోపేట) గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు శనివారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తిర్లింగి నరసింహమూర్తి, గరుకు రాజారావు, తమ్మనేని నారాయణరావు, మోహనరావు, టి.లక్ష్మణరావు, రాజారావు, టి.అప్పలనాయుడు, వార్డు మెంబర్ ముకుందరావు, పైడి రామారావు, తిర్లింగి మధు, నరసింహమూర్తి, టి.రవికుమార్, చింతాడ అప్పలనర్సమ్మ, చంద్రవతి, పూర్ణమ్మ, నారాయణమ్మ, గరుకు అప్పమ్మ, శ్రావణకుమార్, టి.లక్ష్మణరావు, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు. సీఎం జగన్ పాలన, ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేసిన అభివృద్ధితో పాటు రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, జెడ్పీటీసీ కామక భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ తిర్లంగి కృష్ణమోహన్, మండల కమిటీ కార్యదర్శి మళం పూర్ణ, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు, యర్లంకి ధర్మారావు, కలమట రమేష్‌బాబు, పార్టీ నాయకులు కె.వైకుంఠరావు, తమ్మినాయుడు, పిన్నింటి శేషగిరి, నాగేంద్ర, రాజులునాయుడు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తనివ్వకండి

శ్రీకాకుళం అర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తనివ్వకుండా చూడాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థులు ఆదరా బాదరాగా పరీక్ష కేంద్రాలకు చేరుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో రెండు కేంద్రాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో ఏపీ టెట్ – 2024 పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 140 మందికి 124 మంది, రెండు షిఫ్టులో 140 మందికి 134 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 132 మందికి 120 మంది, రెండో షిఫ్టులో 117 మందికి 95 మంది హాజరయ్యారు.

వ్యాన్‌ను ఢీకొన్న బైక్

- ఒకరి మృతి..ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో మృతుడు, క్షతగాత్రులు (ఇన్‌సెట్లో) శివ (ఫైల్)

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను ఢీకొని పప్పు శివ(19) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. శనివారం మధ్యాహ్నం శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపుగా వెళ్తూ పైడిభీమవరంలోని అరబిందో పరిశ్రమ ఎదుట ఆగి ఉన్న వ్యాన్‌ను వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చిన ముగ్గురు యువకులు ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న శివ అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న భాస్కరరావు, హేమంత్‌లకు తీవ్ర గాయాలు కావడంతో అరబిందో అంబులెన్సుపై శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ముగ్గురూ స్నేహితులు కావడంతో పూసపాటిరేగ మండలం గోవిందపురం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు శివ స్వగ్రామం జి.సిగడాం. తండ్రి లక్ష్మణరావు, తల్లి లక్ష్మి, తమ్ముడు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై కె. గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య



ఆకట్టుకున్న న్యూసెంట్రల్ స్కూల్ చిన్నారుల నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం న్యూకాలనీ: విలువలతో కూడిన విద్యను అందించడంలో న్యూ సెంట్రల్ స్కూల్ ముందు వరుసలో ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని పీఎన్‌కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ 30వ వార్షికోత్సవం శనివారం పాఠశాల క్రీడామైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలకు ఎన్‌సీఎస్ స్కూల్ వేదికగా నిలుస్తోందన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పాఠశాల డైరెక్టర్ పి.శ్రీకాంత్ విద్యార్థుల ఎదుగుదలకు, వారి అభివృద్ధికి పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత జేసీ పి.రజనీకాంతరావు, విశ్రాంత డీఈవో బి.మల్లేశ్వరరావు, ఎం.శ్యామ్‌ప్రసాద్, డీవైఈవో ఆర్.విజయకుమారి, జెమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.సుదీర్, కె.దుర్గాశ్రీనివాస్, పాఠశాల ఎండీ కె.రమాకుమారి, డైరెక్టర్లు పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, అధికారులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.